


# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

శనివారం | 16 ఆగస్టు 2025 | పేజీలు 8


# నదీ జలాలపై రాజీ లేదు

- రాష్ట్రానికి రావాల్సిన వాటాలు సాధించుకుంటాం
- గత ప్రభుత్వంలో కాళేశ్వరం పేరిట రూ.లక్ష కోట్ల వృథా
- ఇప్పుడు సెంటిమెంట్‌ను రగిల్చి.. విష ప్రచారం
- 2047 నాటికి గేమ్‌ఛేంజర్ కావడమే లక్ష్యం
- అగ్రగామిగా తెలంగాణ.. ఇదే మా విజన్
- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో సీఎం రేవంత్‌రెడ్డి
- గోల్కొండ కోటపై జాతీయ జెండా ఆవిష్కరణ

**హైదరాబాద్ పెన్ పవర్:** "కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటా కోసం రాజీ పడబోం. ఎవరి బెదిరింపులకూ లొంగేది లేదు. తెలంగాణ భూములు సస్యశ్యామలమయ్యాకే.. మరొకరికి నీళ్ల ఇవ్వడం గురించి ఆలోచిస్తాం. నెహ్రూ హయాంలో నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరామసాగర్‌లతోనే రాష్ట్రానికి నీళ్లు అందుతున్నాయి. గత ప్రభుత్వం కాళేశ్వరం పేరిట రూ.లక్ష కోట్లను గోదావరిలో పోసింది. ఆ ప్రభుత్వ హయాంలోనే కట్టడం, కూలడం రెండూ అయ్యాయి. అంత డబ్బును వృథా చేసి.. ఇప్పుడు మళ్లీ సెంటిమెంట్‌ను రగిలించేంద%రి%్నకు విష ప్రచారం చేస్తున్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా.. రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాలు సాధిస్తాం. తెలంగాణ మాగాణాల చివరి ఆయకట్టు వరకు సాగునీరు ఇచ్చే ప్రణాళికలతో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో సీఎం ప్రసంగించారు.




### గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్‌ల స్ఫూర్తితో...

"గాంధీజీ సారథ్యంలో సాగిన భారత స్వాతంత్ర్య పోరాటం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సారథ్యంలో ప్రజాస్వామ్య పాలనకు పునాదులు వేసుకున్నాం. గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్‌ల వంటి మహనీయులు అందించిన స్ఫూర్తితో.. తెలంగాణను ప్రపంచంలోనే అగ్రభాగాన

-2 లో

# పదవులు.. పైసలు మీకేనా?


### సీఎం రేవంత్‌రెడ్డినే అడుగుతున్నా
### మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** పదవులు మీకే.. పైసలూ మీకేనా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అడుగుతున్నానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. 'వలిగొండ–చౌటుప్పల్ రోడ్డు బిల్లు రావడం లేదని కాంట్రాక్టర్ పని చేయట్లేదు. ఆ బిల్లు ముఖ్యమంత్రి ఇస్తే వస్తుంది. అందుకే ముఖ్యమంత్రిని ఉద్దేశించి అదే అంటున్నా. ముఖ్యమంత్రిని, పార్టీని విమర్శించడం లేదు' అని స్పష్టంచేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లగిరిలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ విగ్రహావిష్కరణ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. '20 నెలల నుంచి మునుగోడు నియోజకవర్గంలో రోడ్లకు, బిల్డింగులకు ఒక్క రూపాయి కూడా రావట్లేదు. నేను మంత్రి దగ్గరకు వెళ్లి అడిగినా రాలేదు. వందసార్లు తిరిగినా ఫలితం లేకపోయింది. అలాంటప్పుడు పదవుల్లో మీరే.. పైసలు మీరే తీసుకుంటున్నారని అడగాలా వద్దా? పదవి(మంత్రి పదవి) విషయంలో అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది. అది వచ్చేటప్పుడు ఎవ్వరు ఆపినా ఆగదు. పదవి వస్తే ప్రజలకే

-2 లో

# రాహుల్ సిప్లిగంజ్‌కు రూ. కోటి చెక్ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్ పెన్ పవర్:** నాటు నాటు పాటతో ఆస్కార్ అవార్డు అందుకున్న సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కు కోటి రూపాయల చెక్ అందజేశారు సీఎం రేవంత్ రెడ్డి. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా గోల్కొండ కోటలో చెక్కును అందజేశారు. ఆర్ఆర్ఆర్ మూవీలో పాడిన నాటు నాటు పాట ఒరిజినల్ మ్యూజిక్ కేటగిరీలో ఆస్కార్ అవార్డు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. హైదరాబాద్ పాతబస్తీ కుర్రాడైన రాహుల్ సిప్లిగంజ్ కు 2023లో ఆస్కార్ అవార్డు వచ్చినప్పుడు పీసీసీ చీఫ్ గా ఉన్న రేవంత్.. అధికారంలోకి వచ్చిన వెంటనే కోటి రూపాయల బహుమతి ఇస్తామని ప్రకటించారు. ఆ సందర్భంగా రూ.10 లక్షల చెక్కును ఇచ్చి సన్మానించారు. ఆ తర్వాత గద్దర్ అవార్డుల వేడుకల్లో కూడా త్వరలో కోటి రూపాయల చెక్కును సిప్లిగంజ్ కు అందజేస్తామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం శుక్రవారం (ఆగస్టు 15) గోల్కొండ కోటలో రాహుల్ సిప్లిగంజ్ కు కోటి రూపాయల చెక్కును అందజేశారు సీఎం రేవంత్ రెడ్డి.

# రాజ్‌భవన్‌లో ఎట్ హోమ్...

## హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు

- స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజ్ భవన్‌లో ఎట్ హోమ్
- తేనీటి విందు ఇచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- హాజరైన వివిధ పార్టీల నాయకులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు



-2 లో

# నదీ జలాలపై రాజీ లేదు

- మొదటి పేజి తరువాయి

నిలబెట్టే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ.. రాష్ట్రాన్ని 20 నెలల్లోనే దేశానికి రోల్‌మోడల్‌గా నిలబెట్టాం. ప్రజా ప్రభుత్వం ఉగాది నుంచి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీని ప్రారంభించింది. రూ.13 వేల కోట్లతో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. రేషన్ కార్డుల కోసం రాష్ట్ర ప్రజలు పదేళ్లు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూశారు. ప్రజా ప్రభుత్వం వచ్చాకే.. ఆ ఎదురుచూపులకు పరిష్కారం లభించింది. జులై 14 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించాం.

**రుణమాఫీలో కొత్త చరిత్ర రాశాం**

గత ఏడాది ఇదే ఆగస్టు 15న రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టాం. 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసి కొత్త చరిత్ర రాశాం. ఇందిరమ్మ రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి సాయం ప్రకటించాం. కేవలం తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. రాష్ట్రంలోని 70,11,184 మంది రైతులకు ఈ సాయం అందించాం. సన్న ధాన్యంపై క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. అన్నదాతల సంక్షేమానికి రూ.1.13 లక్షల కోట్లు ఖర్చు చేశాం. తొలి విడతగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. దీనికి రూ.22,500 కోట్లు వెచ్చిస్తున్నాం.

**ఎస్సీ వర్గీకరణ చేసిన మొదటి రాష్ట్రం మనదే**

స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించుకుని కేంద్రానికి పంపాం. వీటిపై సత్వరం నిర్ణయం తీసుకోవాలని.. కేంద్ర ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేస్తున్నా. దేశంలో ఎస్సీ వర్గీకరణ చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ. ఏటా ఫిబ్రవరి 4ను 'తెలంగాణ సోషల్ జస్టిస్ డే'గా జరుపుకోవాలని నిర్ణయించాం. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 నుంచి రూ. 10 లక్షలకు పెంచాం. 27 ఎకరాల విస్తీర్ణంలో రూ.2,700 కోట్లతో నయా ఉస్మానియా ఆసుపత్రి భవన సముదాయాన్ని నిర్మిస్తున్నాం. 20 నెలల కాలంలో దాదాపు 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం.

**మహిళలు, యువత పురోగతి కోసం**

కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మేం పనిచేస్తున్నాం. బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం కింద.. ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించాం. తద్వారా వారికి రూ.6,790 కోట్లు ఆదా అయింది. ఇటీవలే 200 కోట్ల జీరో టికెట్లను దాటడం మా విజయాల్లో మరో మైలురాయి. రాష్ట్రంలో మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం మా ప్రభుత్వం మొత్తంగా రూ.46,689 కోట్లు సమకూర్చింది. యువత తెలంగాణ శక్తికి ప్రతీక. గత పదేళ్లలో యువతను మత్తుకు బానిసలను చేసే కుట్ర జరిగింది. దాన్ని ఛేదించాం. డ్రగ్స్ నియంత్రణలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలు తెలంగాణ యువత భవిష్యత్‌కు బాసటగా నిలవబోతున్నాయి.

**తెలంగాణ రైజింగ్ నినాదంతో..**

మన బలం హైదరాబాద్. దీనికి మరింత బ్రాండింగ్ చేసే కృషిలో భాగంగా ప్రపంచ సుందరి పోటీలకు ఆతిథ్యమిచ్చాం. ఆ సందర్భంగా మన చారిత్రక కట్టడాలను, వారసత్వ సంపదను ప్రపంచ దేశాలకు చూపించే అవకాశం కలిగింది. గత ఏడాది హైదరాబాద్‌లో వరల్డ్ గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సు, బయో ఆసియా సదస్సు, గ్లోబల్ రైస్ సమ్మిట్, భారత్ సమ్మిట్–2025లను నిర్వహించాం. ఫ్యూచర్ సిటీలో ఏఐ సిటీని ప్రత్యేకంగా ఏర్పాటు చేయబోతున్నాం. తెలంగాణ రైజింగ్ 2047 నినాదంతో ప్రపంచంలోనే తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దే విజన్ మాది. 2047 నాటికి భారతదేశ ముఖచిత్రాన్ని మార్చే 'గేమ్ ఛేంజర్' పాత్రలో తెలంగాణ కీలకంగా ఉండాలన్నదే మా సంకల్పం. రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా వృద్ధి చేసే ప్రణాళికలతో ముందుకెళ్తున్నాం. వరదలతో అతలాకుతలమవుతున్న హైదరాబాద్‌ను.. స్వచ్ఛమైన, సుందరమైన నగరంగా మార్చే సంకల్పాన్ని ఈ విజన్ ఆవిష్కరిస్తుంది. చెరువుల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలను నిరోధించేందుకు హైడ్రాను తీసుకువచ్చాం. హైడ్రా ఇప్పటి వరకు 13 పార్కులు, 20 సరస్సులను ఆక్రమణల నుంచి రక్షించింది. రూ.30 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడింది. మేం అధికారం చేపట్టే నాటికి గత పాలకులు మాకు రూ.8,21,651 కోట్ల అప్పులు, బకాయిలు మిగిల్చి వెళ్లారు. వీటికి మా 20 నెలల పాలనలో రూ.2,20,676 కోట్లు చెల్లించాం. మాకు విల్, విజన్ ఉన్నాయి. మీ అందరి సహకారం, ఆశీర్వాదం అవసరం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**1,200 మంది కళాకారులతో సీఎంకు స్వాగతం**

రాష్ట్రవ్యాప్తంగా స్వాతంత్ర్య వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జాతీయ జెండాను ఎగురవేసి.. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం గోల్కొండ కోటకు చేరుకున్నారు. సీఎంకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్ తదితర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. కోట గుమ్మం వద్ద ముఖ్యమంత్రికి పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. సీఎం వేదికపైకి చేరుకునే క్రమంలో.. రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సుమారు 1200 మంది కళాకారులు 31 కళారూపాల ప్రదర్శనతో స్వాగతం పలికారు. కోటలోని రాణిమహల్ ప్రాంగణంలో సీఎం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రసంగం అనంతరం ముఖ్యమంత్రి.. పలువురు ప్రముఖులను పలకరించారు. చిన్నారులతో ముచ్చటించి.. కరచాలనాలతో అభినందించారు. గాయకుడు రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.కోటి నగదు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు, పలు శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజ్‌భవన్‌లో ఎట్ హోమ్...

# హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు

**హైదరాబాద్ పెన్ పవర్:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాజ్‌భవన్‌లో ఎట్ హోమ్ కార్యక్రమం జరిగింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఏర్పాటు చేసిన తేనీటి విందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, శాసనసభ్యులు, వివిధ పార్టీల నాయకులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారిని గవర్నర్, ముఖ్యమంత్రి ఆప్యాయంగా పలకరించారు.

# పదవులు..

# పైసలు మీకేనా?

- మొదటి పేజి తరువాయి

న్యాయం జరుగుతుంది" అని అన్నారు. 'స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచోళ్లను ఎన్నుకోవాలి. ఎందుకంటే వారితో కలిసి నేను నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కోసం కొట్లాడాలి' అని అన్నారు.

# హైదరాబాద్?లో ఈ ఏరియాల్లో భారీ వర్షం.. వాహనదారులు జాగ్రత్త !



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో గత కొన్ని రోజులుగా కంటిన్యూగా వర్షం కురుస్తోంది. భారీ వర్షాలకు నగరం చుట్టుపక్కల ఉన్న చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నిండిపోయాయి. శుక్రవారం (ఆగస్టు 15) ఉదయం నుంచి కాస్త తెరిపి ఇచ్చిన వాన.. సాయంత్రం 9 గంటల నుంచి చిరు జల్లులతో మొదలై అక్కడక్కడ భారీ వర్షంగా మారుతోంది. కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. సుచిత్ర, కొంపల్లి, గండిమైసమ్మ, దుండిగల్, మల్లంపేట్, బౌరంపేట్, బహదూర్ పల్లి, సూరారం, చింతల్, జీడిమెట్ల , షాపూర్ నగర్, గాజులరామారంలో వాన పడుతోంది. మరోవైపు మేడ్చల్, అల్వాల్, శామీర్ పేట, జవహర్ నగర్ ప్రాంతాలలో భారీ వర్షం కురుస్తోంది. వాహనదారులు షాపింగ్ కాంప్లెక్స్ లు, షెటర్ల కింద తలదాచుకుంటున్నారు. ఇటు మియాపూర్ ఏరియాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఉరుములు, మెరుపులతో వర్షం దంచి కొడుతోంది. ఒకటి రెండు నిమిషాల వానకే రోడ్డుపై వరద ప్రవహించేంత వాన కురుస్తోంది మియాపూర్ లో. నిజాంపేట్ లోనూ వాన పడుతోంది. 9 గంటల తర్వాత మొదలైన వాన మెల్ల మెల్లగా నగరం అంతా వ్యాపిస్తోంది. ఉప్పల్, బోడుప్పల్, పీర్జాదిగూడ, రామంతపూర్, తార్నాక, ఓయూ లలో వర్షం కురుస్తోంది. ఇంటు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, సోమాజిగూడ, అమీర్ పేట్, బోరబండ, ఎర్రగడ్డ, ఫిలింనగర్ ప్రాంతాల్లో కూడా వర్షం కురుస్తోంది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాకు వ్యాపించింది వర్షం. నగరం అంతా వర్షం చుట్టేసింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఇటు ఖైరతబాద్, లక్డీకాపూల్ప్రాంతాల్లో తేలిక పాటి జల్లులు కురుస్తున్నాయి. రానున్న రెండు మూడు గంటల్లో హైదరాబాద్ నగరంలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. చిరు జల్లుల నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని అధికారులు తెలిపారు. అవసరం ఉంటే తప్ప బయటకు రాకపోవడం బెటర్ అని సూచించారు.

# కుత్బుల్లాపూర్‌లో స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు..








సూరారంలోని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు..



దుండిగల్ మండలం, బహదూర్‌పల్లి గ్రామంలోని శ్రీరామ అయోధ్య విల్లాల్లో 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలి ఘనంగా నిర్వహించారు.. ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో విల్లాల సభ్యులందరు పాల్గొన్నారు..







100 మీటర్ల బారి త్రివర్ణ పతకంతో ర్యాలీ నిర్వహించిన ఓ ప్రైవేటు పాఠశాల.. కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని సుచిత్రలోని ఓ పాఠశాల ఆధ్వర్యంలో 100 మీటర్ల. జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భాగంగా గోదావరి హెూమ్స్, స్కూల్ నుండి సుచిత్ర .వెన్నెలగడ్డ, రాఘవేంద్ర కాలనీ వరకు నిర్వహించారు. ఈ యొక్క ర్యాలీలో సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ, దేశ ప్రజలు అందరూ ఐక్యంగా ఉన్నపుడే దేశం అభివృద్ధి చెందుతుంది, పహల్గమ్ దాడి తరువాత ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రత్యర్థి స్థావరాలను మట్టిబెట్టిన తరువాత దేశ ప్రజల ఐక్యత అభినందనియమని అయన అన్నారు, ఈ యొక్క కార్యక్రమంలో పాఠశాల డీన్.కల్పన, ప్రధాన ఉపాధ్యాయుడు కార్తీక్, మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.. జీడిమెట్ల న్యూస్, పెన్ పవర్, ఆగష్టు 15..



79వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో భాగంగా, మున్సిపల్ గ్రౌండ్‌లో నివసించే చిన్నారులతో జెండా పండుగను, సీనియర్ విద్యార్థి నాయకుడు సాయికుమార్ పంతుల 15 ఆగష్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మున్సిపల్ గ్రౌండ్ ప్రాంతంలో నివసించే చిన్నారులతో కలిసి వేడుకల నిర్వహణ, ప్రత్యేకంగా నిలిచాయి..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలను త్యాగం చేసిన, తిరుగులేని ధైర్యంతో, దేశభక్తితో స్వాతంత్ర్యం కోసం పోరాడిన లక్షలాది మంది మన స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను చిన్నారులకు వివరించారు, స్వతంత్రం కోసం ఎందరో త్యాగ ఘనుల పోరాట త్యాగఫలం నేటి స్వతంత్రమని సాయికుమార్ పంతుల కొనియాడారు.. అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేశారు.. ఈ కార్యక్రమంలో హర్ష, నవీన్, ముజీబ్, సునీల్, తేజ తదితరులు పాల్గొన్నారు..


పెన్ పవర్ న్యూస్, కుత్బుల్లాపూర్, ఆగష్టు 15:





## రంగారెడ్డి జిల్లాలో 1,500 గాంధీ విగ్రహాలతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- ప్రైవేటు పాఠశాలలో వినూత్నంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- మహాత్ముడి గొప్పతనం, విలువలు తెలియజేయాలనే ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వెల్లడి
- ప్రత్యేక మెమొంటోను అందజేసిన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్



**హైదరాబాద్ పెన్ పవర్:**రంగారెడ్డి జిల్లాలోని ఒక ప్రైవేటు పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వినూత్నంగా జరిగాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడలోని ఒక పాఠశాలలో 1,500 గాంధీ విగ్రహాలను ప్రదర్శించారు. మహాత్ముడి గొప్పతనం, ఆయన విలువలు ఈ తరం చిన్నారులకు తెలియజేయాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు పాఠశాలకు ప్రత్యేక మెమొంటోను అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## తెలంగాణ డీజీపీ జితేందర్ ఇంట తీవ్ర విషాదం..





**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. డీజీపీకి మాతృవియోగం కలిగింది. జితేందర్ తల్లి కృష్ణ గోయల్(85) శుక్రవారం (ఆగస్టు 15) ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కృష్ణ గోయల్.. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

శనివారం ఉదయం మహాప్రస్థానంలో డీజీపీ తల్లి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కృష్ణ గోయల్ మృతిపట్ల పలువురు రాజకీయ నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సంతాపం ప్రకటించారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఉప్పల

### జై వాసవి అన్నపూర్ణ ఆర్య వైశ్య సంఘం కార్యాలయాన్ని ప్రారంభించిన ఉప్పల





**ఎల్బీనగర్ పెన్ పవర్ ఆగష్టు 15:** సమరయోధుల పోరాట బలం అమరవీరుల త్యాగఫలం బ్రిటీష్ పాలకులపై తిరుగులేని విజయం మన స్వాతంత్ర్య దినోత్సవమని టీపీసిసి ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. 79 వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా నాగోల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన జై వాసవి అన్నపూర్ణ ఆర్య వైశ్య సంఘం నూతన కార్యాలయాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్న నాగోల్ జై వాసవి అన్నపూర్ణ ఆర్య వైశ్య సంఘం కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జై వాసవి అన్నపూర్ణ ఆర్య వైశ్య సంఘము అధ్యక్షులు జగిని అశోక్, ప్రధాన కార్యదర్శి అనిల్,
కోశాధికారి సాయి రమేష్, కొంపల్లి శ్రీనివాస్ మరియు కోర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ జెండాను ఆవిష్కరించిన చిలుక మధు



**ఎల్బీనగర్ పెన్ పవర్ ఆగష్టు 15:** గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయం నందు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ప్రధాన అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలో పాలకవర్గం సభ్యులు బండి మధుసూదన్ రావు, మచ్చేందర్ రెడ్డి, నర్సింహ, రఘుపతి రెడ్డి, గణేష్ నాయక్, అంజయ్య, వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, అలాగే అధికారులు, వర్తకులు, రైతులు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

# పల్టీలు కొడుతూ సాగర్ కాలువలోకి దూసుకెళ్లిన కారు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఘోర ప్రమాదం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కల్లూరు జరిగింది. 2025, ఆగస్ట్ 15వ తేదీ మధ్యాహ్నం జరిగిన ఈ యాక్సిడెంట్ కలకలం రేపింది.

సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల నుంచి కల్లూరు వెళుతున్నది ఓ కారు. సరిగ్గా కల్లూరు దగ్గరకు వచ్చే సమయానికి వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పింది. డ్రైవర్ బ్యాలెన్స్ చేయలేకపోయాడు. దీంతో రోడ్డు పక్కనే ఉన్న సాగర్ కాలువలోకి దూసుకెళ్లింది కారు.



అదృష్టం ఏంటంటే.. సాగర్ కాలువలోకి వెళ్లిన కారు నుంచి డ్రైవర్ సురక్షితంగా ఈదుకుంటూ బయటకు వచ్చాడు. ఆ వెంటనే స్థానికులకు సమాచారం ఇచ్చారు. లోకల్ గా ఉన్న కొంత మంది ఈతగాళ్లు, గ్రామస్తులు రంగంలోకి దిగారు. కాలువలోని కారుకు తాళ్లు కట్టి ఒడ్డుకు ఈడ్చుకొచ్చారు. ప్రమాదం ఘోరంగా జరిగినా ఎలాంటి ప్రాణ నష్టం లేకపోవటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

కారులో డ్రైవర్ ఒక్కరే ఉండటంతో ప్రమాదం తప్పింది అంటున్నారు స్థానికులు.

## టోల్ తిప్పలు ఇప్పట్లో తప్పేలా లేవు.. ఇయర్లీ టోల్ పాస్ తెలంగాణ వెహికిల్స్‌కు అమలు కాదంట !

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ వ్యాప్తంగా జాతీయ రహదారులపై ఇవాల్టి నుంచి (ఆగస్టు 15) అమల్లోకి వచ్చిన వార్షిక టోల్ పాస్ స్కీమ్.. తెలంగాణ వాహన దారులకు ఉపయోగం లేకుండా పోయింది. రాష్ట్రానికి చెందిన వెహికల్స్ వాహన్ పోర్టల్ లో నమోదు కాకపోవడమే ఇందుకు కారణం. కేంద్ర రవాణా శాఖ తీసుకొచ్చిన ఈ కొత్త విధానంలో కార్లు, జీపులు, వ్యాన్లు వంటి వాణిజ్యేతర వెహికల్స్ కు హైవేలపై టోల్ గేట్ల వద్ద వార్షిక ఫాస్టాగ్ పాస్ స్కీమ్ అమలు చేస్తున్నా రు. వాహనదారులు రూ.3 వేలు చెల్లించి ఈ వార్షిక పాసు తీసుకుంటే ఏడాదిలో 200 సార్లు ఉచితంగా టోల్గేట్ గుండా వెళ్లేందుకు అను మతిస్తారు. అంటే సగటున ఒక్కసారి టోల్ గేట్ దాటేందుకు రూ.15 ఖర్చు అవుతోంది. అప్పటికే ఫాస్టాగ్ కలిగిన వాహనదారులకు ఇది అమలు చేస్తామని, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నుంచి దీన్ని అమల్లోకి తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు వర్తిస్తున్న ఈ వార్షిక టోల్ పాస్ స్కీమ్ ఒక్క తెలంగాణ మాత్రం బెనిఫిట్ లేకుండా పోయింది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ కేంద్ర రవాణా శాఖ రాష్ట్ర ప్రభు త్వానికి లేఖ కూడా రాసింది.

## చుక్క నీరు కూడా వదలబోం.. ఎంత వరకైనా పోరాడతాం

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 79వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. గోల్కొండ కోటలో జరిగిన వేడుకల్లో రేవంత్ రెడ్డి పాల్గొని పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజల ను ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే మరొకవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పయనింపచేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. సాగునీరు చుక్కనీటిని కూడా ఇతరులు తరలించకుండా పోకుండా ఉండేందుకు అన్ని రకాలుగా తాము వ్యూహాలు రూపొందించుకుంటున్నామని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణకు దక్కాల్సిన నీటిని ఎవరు తరలించుకుపోయే ప్రయత్నాన్ని అయినా అడ్డుకుంటామని రేవంత్ రెడ్డి చెప్పారు.

### కృష్ణా, గోదావరి నదిలో...

కృష్ణా, గోదావరి నదిలో ప్రతి చుక్క నీరు తెలంగాణ ప్రజలకు దక్కాల్సిందేనని అన్నారు. ఇందుకోసం ఎంతదాకైనా పోరాడతామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఎవరెన్ని ఎత్తులేసినా చిత్తు చేస్తామన్న రేవంత్ రెడ్డి సెంటిమెంట్ రెచ్చగొట్టే వారి మాటలను వినవద్దని కోరారు. ఎవరి బెదిరింపులకు లొంగిపోయే ప్రభుత్వం తమది కాదని ఆయన అన్నారు. గత పదేళ్ల నుంచి ప్రజాస్వామ్యం అంటే తెలియకుండా నడిపిన ప్రభుత్వాన్ని పారదోలి తమకు అవకాశం ఇచ్చిన ప్రజల రుణం తీర్చేందుకు తాము నిరంతరం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. పేదలకు సన్న బియ్యం పంచిపెట్టిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. పదేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డులు కూడా మంజూరు చేయలేదని, తాము వచ్చిన తర్వాతనే కొత్త రేషన్ కార్డులకు అర్హులందరికీ అందాయని రేవంత్ రెడ్డి అన్నారు.

### హైదరాబాద్ నగరం...

హైదరాబాద్ నగరం మనకు అన్ని రకాలుగా అండగా ఉంటుందన్న ఆయన హైదరాబాద్ నగరాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలను రచిస్తున్నామని చెప్పారు. స్వచ్ఛమైన, శుభ్రమైన, సౌకర్యవంతమైన నగరంగా తీర్చిదిద్దాలని తమ ప్రభుత్వం భావిస్తుందని రేవంత్ రెడ్డి తెలిపారు. అందుకే హైడ్రా వంటి సంస్థను ఏర్పాటు చేసి చెరువులు, నాలాలపై ఉన్న ఆక్రమణలను తొలిగించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈరోజు కురుస్తున్న భారీ వర్షాలు కాలనీలు, రోడ్లమీద పడుతున్నాయంటే దానికి కారణం నాలాలు, చెరువుల ఆక్రమణలేనని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును కూడా తమ ప్రభుత్వం చేపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎవరెన్ని అడ్డంకులు పెట్టినా అభివృద్ధి ఆగబోదని ఆయన అన్నారు.

# బనకచర్లను నిర్మిస్తామన్న చంద్రబాబు... ఈ అంశంపై రేవంత్ రెడ్డి స్పందన ఏమిటంటే..!

- కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులపై రాజీ పడబోమన్న రేవంత్
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరి వల్లే రాష్ట్రానికి నష్టం జరిగిందని ఆరోపణ
- ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించి కేసీఆర్ తప్పు చేశారని విమర్శ




**హైదరాబాద్ పెన్ పవర్:**రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదం మరోసారి రాజుకుంది. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల ఎవరికీ నష్టం జరగదని... ఈ ప్రాజెక్టుపై ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదని ఈరోజు ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఈ అంశంపై ప్రతిస్పందించారు. కృష్ణా, గోదావరి నదులపై తెలంగాణకు ఉన్న హక్కుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు ప్రతి నీటి చుక్క కోసం తమ ప్రభుత్వం పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

నదీ జలాల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన వైఖరి వల్లే తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు అప్పగించారని విమర్శించారు. ఆనాటి ప్రభుత్వ నిర్ణయాల కారణంగానే ఈరోజు తెలంగాణ సాగునీటి హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు.

తెలంగాణ ప్రజల ప్రయోజనాలే తమకు అత్యంత ముఖ్యమని పునరుద్ఘాటించిన రేవంత్ రెడ్డి, పొరుగు రాష్ట్రంతో స్నేహపూర్వక సంబంధాలు కోరుకుంటామని, అయితే హక్కుల విషయానికి వస్తే మాత్రం వెనక్కి తగ్గేది లేదని గట్టిగా హెచ్చరించారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ఎలాంటి రాజీకి తావులేదని ఆయన భరోసా ఇచ్చారు. నెహ్రూ నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీశైలం, శ్రీరామ్ సాగర్ లతోనే మనకు నీళ్లు అందుతున్నాయని చెప్పారు. హైదరాబాద్ అంటే ఒక బ్రాండ్ అని... ఈ బ్రాండ్ ను మరింత ముందుకు తీసుకెళతామని అన్నారు. ప్రపంచ సుందరీమణుల పోటీలను హైదరాబాద్ లో నిర్వహించామని... ఈ సందర్భంగా పోటీలకు వచ్చిన వారికి తెలంగాణ ప్రత్యేకతలు చూపించామని తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించిన బయో ఏషియా సదస్సు ప్రపంచం దృష్టిని ఆకర్షించిందని చెప్పారు. ఇక్కడి ఫార్మా కంపెనీలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు.

# మూడు పార్టీల్లో హీట్ పుట్టిస్తున్న జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అన్ని పార్టీల మధ్య కాక రేపుతుంది. నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా అన్ని పార్టీలు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటి నుంచే అస్త్ర శస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచి సత్తా చాటుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. ఉప ఎన్నికల్లో గెలిచి తమ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం చెక్కు చెదరలేదని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుంది. అదే సమయంలో ప్రభుత్వంపై రెండేళ్లలోనే అసంతృప్తి పెరిగిందని, అందుకు ఉప ఎన్నికల్లో గెలిచి నిరూపించాలని బీఆర్ఎస్ పార్టీ తహతహలాడుతుంది. మరొకవైపు బీజేపీ కూడా తాము రేసులో ఉన్నామని, ఈ సారి అధికార పీఠం తమదేనని తేల్చి చెప్పేందుకు ఈ ఎన్నికను రెఫరెండంగా చూడాలని కమలనాథులు చెబుతున్నారు.

### హైకమాండ్ నిర్ణయమే...

కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ఇప్పటికే అభ్యర్థి విషయంలో స్పష్టత ఇచ్చింది. లోకల్స్ ను మాత్రమే అభ్యర్థిగా ఎంపిక చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగంగానే ప్రకటించారు. అంటే ఇతర నియోజకవర్గాలకు చెందిన నేతలు ఇక్కడ పోటీ చేయాలన్న ఆశలు పెట్టుకోవద్దని కూడా సున్నితంగా తెలిపినట్లయింది. అయితే గత ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ తీవ్రంగానే ఢిల్లీలో తనకున్న లాబీయింగ్ తో ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అజారుద్దీన్ ను అభ్యర్థిగా ఎంపిక చేయడం స్థానిక రాష్ట్ర నాయకత్వానికి ఇష్టం లేనట్లు కనిపిస్తుంది. అజారుద్దీన్ ప్రజలకు అందుబాటులో ఉండే నేత కాదని, అందుకే ప్రత్యామ్నాయం వైపు హస్తం పార్టీ చూస్తున్నట్లు సమాచారం. మరి హైకమాండ్ నిర్ణయం ఎలా ఉంటుందన్నది చూడాలి.

### సర్వే తర్వాతనే...

మరొక వైపు బీఆర్ఎస్ పార్టీ ఖచ్చితంగా ఈ స్థానాన్ని సొంతం చేసుకోవాలని భావిస్తుంది. తమ సిట్టింగ్ స్థానం కావడంతో తిరిగి నిలుపుకుని కేసీఆర్ కు ఉన్న ఇమేజ్ ఏమాత్రం తగ్గలేదని, అదే సమయంలో రేవంత్ సర్కార్ పై వ్యతిరేకత ప్రారంభమయిందని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నేతల్లోనూ, క్యాడర్ లోనూ జోష్ నింపాలంటే ఈ ఎన్నికలో గెలవడం ముఖ్యమని భావిస్తుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు కూడా ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ లో కీలక నేతలతో భేటీ అయ్యారు. కేటీఆర్, హరీశ్ రావు, జగదీశ్వర్ రెడ్డి తదితరులతో జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికపై ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. అయితే ఇద్దరు ముగ్గురు అభ్యర్థుల పేర్లను కేసీఆర్ పరిశీలిస్తున్నారని, సర్వేచేయించిన అనంతరం వారిలో ఒకరికి కేటాయిస్తారని అంటున్నారు.

### బీజేపీలో లాబీయింగ్...

ఇక బీజేపీ కూడా జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికపై నమ్మకం పెట్టుకుంది. ఇక్కడ తెలుగుదేశం పార్టీ ఓటుబ్యాంకుతో పాటు సినీ ప్రముఖులు ఎక్కువగా ఉండటం తమకు కలసి వచ్చే అంశంగా భావిస్తుంది. అయితే టీడీపీతో పొత్తుకు మాత్రం బీజేపీ సిద్ధపడటం లేదు. టీడీపీ, జనసేనల నుంచి లోపాయికారీ పొత్తును కుదుర్చుకుని బరిలోకి దిగి గెలవాలని బీజేపీ కూడా వ్యూహాలు రచిస్తుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక టిక్కెట్ కోసం అనేక మంది నేతలు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇది కూడా ఢిల్లీ స్థాయిలో తేలాల్సిన అంశం కావడంతో కొందరు కేంద్రమంత్రులు బండి సంజయ్ ద్వారా, మరికొందరు కిషన్ రెడ్డి ద్వారా, ఇంకొందరు రాజ్యసభ్యుడు కె.లక్ష్మణ్ ద్వారా లాబీయింగ్ మొదలుపెట్టినట్లు తెలిసింది. మొత్తం మీద జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక మూడు పార్టీల్లో హీట్ రేపుతుందని చెప్పాలి.

## మొఘల్ చక్రవర్తి సమాధి దగ్గర ప్రమాదం : పైకప్పు కూలి ఐదుగురు స్పాట్ డెడ్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీ నిజాముద్దీన్ ఏరియా. ఇక్కడే మొఘల్ రాజుల సమాధులు ఉన్నాయి. మొఘల్ సామ్రాజ్యంలోని రెండో రాజు.. చక్రవర్తి అయిన హుమాయున్ సమాధి ఉంది. ఈ ప్రాంతంలో నిర్మాణాలు కూడా ఉన్నాయి. సమాధుల ప్రాంతంలోని ఓ విశ్రాంతి గదులు ఉన్నాయి. ఇప్పుడు ఇక్కడే ప్రమాదం జరిగింది.విశ్రాంతి గదుల పైకప్పు కూలి పోయింది. ఐదుగురు చనిపోయారు. 12 మంది గాయపడ్డారు. 2025, ఆగస్ట్ 15వ తేదీ మధ్యాహ్నం 4 గంటల 30 నిమిషాల సమయంలో ఈ ప్రమాదం జరిగింది.హుమాయున్ సమాధి సముదాయంలో ఓ మసీదు ఉంది. దాని పక్కనే ఉన్న రెస్ట్ రూమ్స్ పై కప్పు కూలి ఈ ప్రమాదం జరిగినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు.హుమాయున్ సమాధి సముదాయం కూలిపోతుంది అంటూ ఓ ఫోన్ కాల్ వచ్చిందని.. ఆ వెంటనే పోలీసులు, ఫైర్, రెస్క్యూ సిబ్బంది స్పాట్ కు చేరుకున్నాం అని వెల్లడించారు ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ ఆఫీసర్.ప్రమాదం నుంచి 12 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చామని.. వాళ్లందరూ ప్రాణాలతో బయటపడ్డారని వివరించారు ఫైర్ సిబ్బంది. ఐదుగురు చనిపోయినట్లు స్పష్టం చేసిన అధికారులు. సహాయ చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు.ఢిల్లీలో కొన్ని రోజులుగా భారీ వర్షాలు పడుతున్నాయి. పాత బిల్డింగ్స్, పెద్ద పెద్ద చెట్లు కూలిపోతున్నాయి. ఈ క్రమంలోనే హుమాయున్ సమాధి ఏరియాలోని రెస్ట్ రూమ్స్ కూలిపోయి ఉండొచ్చు అంటున్నారు NDRF అధికారులు.హుమాయున్ సమాధిని యునెస్కో వారసత్వ ప్రదేశంగా గుర్తింపు ఉంది. ఢిల్లీలో ప్రముఖ పర్యాటన ప్రాంతం కూడా ఇది. రోజూ వందలాది మంది దేశీయ, విదేశీ పర్యాటకులు హుమాయున్ టూబ్స్ సందర్శిస్తుంటారు. దీన్ని 16వ శతాబ్దంలో హుమాయున్ స్మారక చిహ్నంగా నిర్మించారు. హుమాయున్ సమాధి ఇక్కడే ఉంది. ఇప్పుడు ఈ సమాధి పక్కనే ఈ ప్రమాదం జరిగింది.

## ఇంట్లో నుంచే బృందావన్, మధుర, ద్వారకలో కృష్ణుడి పుట్టిన రోజు వేడుకలు చూడొచ్చు.

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆగస్టు 16 కృష్టాష్టమి .. శ్రీకృష్ణుని ఆలయాలు చాలా బిజిగా ఉంటాయి. దేశవ్యాప్తంగా ప్రముఖ ఆలయాలకు జనాలు బారులు తీరుతారు. బృందావన్, మధుర, ద్వారకలో కృష్ణుడి పుట్టిన రోజు వేడుకలు అద్భుతంగా జరుగుతాయి. ఈ వేడులను ఇంట్లో ఉండే ఆన్? లైన్? లో చూసే విధంగా ఏర్పాటు చేశారు. ఇండియాలో ద్వారకాధీష్, బాంకే బిహారీ,మధుర అనేవి శ్రీ కృష్ణుడికి సంబంధించిన ముఖ్యమైన దేవాలయాలు. ద్వారకాధీష్ గుడి ద్వారకలో ఉంది, ఇది గుజరాత్ లోని ఒక పురాతన నగరం.బాంకే బిహారీ గుడి బృందావనంలో ఉంది, ఇది ఉత్తర ప్రదేశ్ లోని ఒక పుణ్యక్షేత్రం. ఈ దేవాలయాల్లో శ్రీకృష్ణాష్టమి రోజున ప్రత్యేక పూజలు జరుగుతాయి. భక్తులు భారీగా తరలివస్తారు. జన్మాష్టమి రోజున ఇంట్లో కూర్చుని స్వామిని ఆన్? లైన్?లో దర్శించే అవకాశాన్ని కొన్నియాప్?ల ద్వారా కలుగజేశారు. దివ్య మరాఠీ యాప్‌లో స్వామిని దర్శిస్తే మూడు కృష్ణ దేవాలయాల గర్భగుడిలోకి వర్చువల్‌గా ప్రవేశించిన అనుభూతి కలుగుతుంది. అలా దర్శించిన వారు ప్రతి ఆలయంలో జరిగే పూజలను ఇంట్లో కూడా చేయగలుగుతారు.

ఈ దేవాలయాలు ఏడాదంతా బిజీగానే ఉంటాయి. ఈ దేవాలయాల్లో భగవంతుని దర్శనం చేసుకోవాలంటే చాలాకష్టమని చెబుతుంటారు. అందుకే సామాన్యులు కూడా కృష్ణాష్టమి రోజున ఇంట్లో ఉండి ప్రసిద్ధ దేవాలయాల్లో శ్రీకృష్ణుని గర్భగుడిలో కూర్చున్న అనుభూతిని పొందుతారు. తీర్థం... స్వామికి సమర్పించిన పూలు.. తులసి ప్రసాదం కూడా సమర్పించే అవకాశం ఉందని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. రేపు ( ఆగస్టు16) ఇంట్లో కూర్చొని ద్వారకాధీష్, బాంకే బిహారీ.. శ్రీ కృష్ణ జన్మభూమిని సందర్శించి, పూజ చేసి, పూర్తి హారతి ఇచ్చే ప్లాన్? చేసుకోండి.

# టారిఫ్ ల వేళ అమెరికాకు ఇచ్చి పడేసిన మోడీ

**హైదరాబాద్ పెన్ పవర్:**దేశవ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి జ్వాలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశ ప్రజలను ఉద్దేశించి కీలక సందేశం ఇచ్చారు. అమెరికా సుంకాల బెదిరింపులు, గ్లోబల్ ఆర్థిక సవాళ్ల మధ్య భారత వ్యాపారాలు, ఉత్పత్తులపై విశ్వాసం పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.మోదీ మాట్లాడుతూ "చరిత్రను లిఖించాల్సిన సమయం ఇది. మనం ప్రపంచ మార్కెట్‌ను పాలించాలి. తక్కువ ఖర్చుతో అధిక నాణ్యత కలిగిన ఉత్పత్తులను అందించాలి. ఆర్థిక స్వార్థం పెరుగుతున్న ఈ సమయంలో మన లక్ష్యాలను సాధించేందుకు ముందుకు సాగాలి" అని స్పష్టం చేశారు. మన శక్తిని ఇతరులను తక్కువ చేసి మాట్లాడటంలో వృథా చేయకుండా స్వీయ బలోపేతంపై దృష్టి పెట్టాలని సూచించారు.దేశంలోని వ్యాపారులు, దుకాణదారులు స్వదేశీ ఉత్పత్తుల విక్రయాలపై దృష్టి పెట్టాలని, ప్రపంచం భారత పురోగతిని గమనిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాల్లో అవసరమైన మార్పులపై సూచనలు ఇవ్వాలని కోరుతూ రైతు వ్యతిరేక విధానాలను సహించబోమని హామీ ఇచ్చారు. రైతులు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, వారికీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని మోదీ భరోసా ఇచ్చారు.



### అణు ఇంధనంలో ప్రైవేటు పెట్టుబడులు

ఇంధన స్వయం సమృద్ధి లక్ష్యంగా సూర్యశక్తి, గ్రీన్ హైడ్రోజన్, అణు ఇంధనం రంగాల్లో వేగంగా అడుగులు వేస్తున్నామని మోదీ వెల్లడించారు. అణు విద్యుత్ రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పెట్రోల్, డీజిల్ దిగుమతులపై దేశం ప్రతి సంవత్సరం లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని, కొత్త ఇంధనాల అభివృద్ధితో ఈ దిగుమతులను తగ్గించడమే లక్ష్యమన్నారు. కీలక ఖనిజాల ప్రాధాన్యం పెరుగుతున్న ఈ సమయంలో, దిగుమతులు తగ్గితే స్వయం సమృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

### స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో కొత్త రికార్డు

ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మోదీ మరో రికార్డు సొంతం చేసుకున్నారు. అత్యధిక కాలం స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేసిన ప్రధానిగా ఆయన నిలిచారు. ఈసారి 103 నిమిషాల పాటు ప్రసంగించి, గతేడాది తనే సాధించిన 98 నిమిషాల రికార్డును అధిగమించారు.

దేశ ప్రజలతో నిండైన సంభాషణ జరిపిన మోదీ, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనకు ప్రతి పౌరుడు తన వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# మనుషులకే కాదు మరమనుషులకి కూడా ఒలంపిక్స్.. ఎక్కడో తెలుసా?

**హైదరాబాద్ పెన్ పవర్:**మారుతున్న కాలం.. పెరుగుతున్న టెక్నాలజీ.. కారణంగా ఇప్పటి జనరేషన్లో మనుషులతో అవసరాలే ఉండట్లేదు.. అన్నింటికీ రోబోలే అవసరం అవుతున్నాయి. మనుషులని పక్కన పెట్టి ప్రతి పనిలో రోబోలనే వాడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మనిషి అనేవాడు రోబో లకు సర్వెంట్లుగా మారతారేమో అనిపిస్తుంది. అయితే ఈ రోబోల వల్ల ఎన్ని లాభాలు ఉంటాయో.. అన్ని నష్టాలు కూడా ఉంటాయి. రజినీకాంత్ రోబో సినిమాలో.. ఈ రోబోల వల్ల కలిగే నష్టాలు, లాభాలు రెండు క్లియర్ గా చూపించారు. అయితే రోబోల వల్ల నష్టాలు జరగకూడదు అని ప్రతి కంపెనీ తమ టెక్నాలజీతో ఒక రోబోను మించి మరో రోబోని తయారు చేస్తున్నారు.

ఈ విషయం పక్కన పెడితే.. ఒలంపిక్స్ అంటే అందరూ మనుషులు పాల్గొనే ఒలంపిక్స్ అనుకుంటారు. కానీ తాజాగా రోబోలకి కూడా ఒలంపిక్స్ క్రీడలు నిర్వహిస్తున్నారు.మరి ఇంతకీ రోబోలకి ఒలంపిక్స్ పెట్టబోతున్న ఆ దేశం ఏది అనేది చూస్తే.. చైనా.. అవును మీరు వినేది నిజమే.చైనా త్వరలోనే హ్యూమనాయిడ్ రోబోలకు ఒలంపిక్ క్రీడలను నిర్వహించబోతుందట. చైనాలో తొలిసారి వరల్డ్ హ్యూమనాయిడ్ ఒలంపిక్ క్రీడలు నిర్వహిస్తున్నారట. రోబోలు ఈ ఒలింపిక్



క్రీడల్లో దాదాపు 16 దేశాల నుండి 280 జట్లు పాల్గొనబోతున్నట్టు తెలుస్తోంది. జపాన్, జర్మనీ,అమెరికా, బ్రెజిల్ వంటి దేశాల నుండి 88 ప్రైవేట్ సంస్థలు, అలాగే 192 యూనివర్సిటీలు ఈ ఒలింపిక్ క్రీడల్లో పాల్గొనబోతున్నాయి. చైనాలోని బీజింగ్ మున్సిపల్ గవర్నమెంట్ ఈ హ్యూమనాయిడ్ రోబోల ఒలంపిక్స్ ని నిర్వహిస్తోంది.

ఇక చైనా నుండి ఈ ఒలంపిక్స్ లో ఫోరియర్, యూనిట్రీ అనే రెండు సంస్థలు పాల్గొనబోతున్నాయి. చైనా చాలా సంవత్సరాల నుండి రోబోలు తయారు చేయడంలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీతో రోబోలను తయారు చేస్తూ మార్కెట్లోకి తీసుకురావాలని ట్రై చేస్తోంది.అంతేకాదు చైనా ఇప్పటికే రోబోటిక్స్, ఏఐ రంగం కోసం దాదాపు 20 బిలియన్ల డాలర్లను ఖర్చు చేశారు.భవిష్యత్తులో రోబోటిక్స్, ఏఐ స్టార్టప్ కంపెనీల కోసం దాదాపు 137 బిలియన్ డాలర్లతో ఓ నిధిని కూడా అక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తుందట. అందుకోసమే చైనా దేశం హ్యూమనాయిడ్ రోబోలకు సంబంధించిన చాలా ఈవెంట్లని పెద్ద ఎత్తున నిర్వహిస్తుందని తెలుస్తోంది.

ఇక చైనా నిర్వహిస్తున్న ఈ హ్యూమనాయిడ్ రోబోల ఒలంపిక్స్ లో ఏ ఏ క్రీడలు ఉంటాయంటే.. స్ప్రింట్ రన్నింగ్, బాక్సింగ్, సాకర్ వంటి పోటీలు మొదట నిర్వహిస్తారు.అలాగే హ్యూమనాయిడ్ రోబోలు వస్తువులను గుర్తించడం, ఒక దగ్గరి నుండి మరో దగ్గరికి తీసుకువెళ్లడం, ఔషదాలను గుర్తుపట్టడం, క్లీనింగ్ సర్వీసెస్ వంటి విభాగాలలో ఈ రోబో లకు ఒలంపిక్స్ నిర్వహిస్తారట. అంతేకాకుండా ట్రాక్ అండ్ ఫీల్డ్, ఫుట్ బాల్,టేబుల్ టెన్నిస్ వంటి పోటీలు కూడా ఈ ఒలంపిక్స్ లో ఉంటాయి. అయితే డ్రాగన్ కంట్రీ కొన్ని సంవత్సరాల క్రితమే బీజింగ్ లో హ్యూమనాయిడ్ రోబోల కోసం ఒక మారథాన్ ని నిర్వహించింది.కానీ ఈ మారథాన్ లో పాల్గొన్న చాలా రోబోలు లక్ష్యాన్ని చేరుకోక ముందే దెబ్బతిన్నాయి. మరి మనుషులకి కాకుండా మరమనుషులకి ఒలంపిక్స్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏ రోబో సత్తా చాటుతుందో చూడాలి.

# మొయినాబాద్ ఫాంహౌస్‌లో రేవ్ పార్టీ.. లిక్కర్, హుక్కాతో తిక్క తిక్క చేసిన ఆఫ్రికను




**హైదరాబాద్ పెన్ పవర్:** రేవ్ పార్టీలపై ఎన్ని రిస్ట్రిక్షన్స్ విధించినా చాటుమాటున పార్టీలు నడుస్తూనే ఉన్నాయి. లిక్కర్, డ్రగ్స్, హుక్కా. ఇలా మత్తు పదార్థాలతో పార్టీలో ఎంజాయ్ చేస్తూ రెచ్చిపోతూనే ఉన్నారు. శుక్రవారం (ఆగస్టు 14) రాత్రి మొయినాబాద్ లోని ఓ ఫాం హౌస్ లో పర్మిషన్ లేకుండా పార్టీ చేసుకుంటున్న 51 మందిని అదుపులోకి తీసుకున్నారు. పార్టీలో వినియోగిస్తున్న మత్తు పదార్థాలను చూసి పోలీసులు ఆశ్చర్యానికి గురయ్యారు.రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ చెప్పిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ లోని బాకారం ఫామ్ హౌస్ లో %ూుు%, లోకల్ పోలీసులతో రైడ్ చేశారు. ఫాంహౌస్ పార్టీలో 51మందిని గుర్తించినట్లు తెలిపారు. అందులో 14 మంది పురుషులు, 37 మంది మహిళలు ఉన్నారు. వీళ్లలో ఆఫ్రికన్ కంట్రీ కి చెందిన వాళ్ళు ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. ఉగాండా, సినియన్, కెన్యా మరో రెండు ఆఫ్రికన్ దేశాలకు చెందిన వారు ఉన్నట్లు గుర్తించారు పోలీసులు. ఉగాండాకు చెందిన మమాస్ అనే మహిళ ఫాం హౌస్ లో బర్త్ డే పార్టీ నిర్వహించింది. ఈమె అక్రమంగా హైదరాబాద్ లో ఉంటున్నట్లు చెప్పారు పోలీసులు. వీసా గడువు ముగిసినా ఇల్లీగల్ గా ఉంటున్నట్లు గుర్తించారు. మమాస్ తన బర్త్ డే పార్టీలో లిక్కర్ పార్టీ నిర్వహించారు. మొత్తం 65 బీర్లు, 20 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు చెప్పారు పోలీసులు. ఎక్సైజ్, లోకల్ పోలీసుల పర్మిషన్ లేకుండా ఇష్టారీతిన పార్టీ నిర్వహిస్తున్నారు. అర్థరాత్రి విపరీతమైన సౌండ్ తో పార్టీ నిర్వహించారు. దీంతో సౌండ్ వయలేషన్ కింద కేసు నమోదు చేశారు పోలీసులు. ఇమిగ్రేషన్ అధికారులను పిలిపించి వీసాలు జెన్యూన్ గా ఉన్నాయా లేవా అని చెక్ చేస్తున్నారు. 51 మందిలో 12 మంది స్టూడెంట్స్ కూడా ఉన్నట్లు గుర్తించారు.

పర్మిషన్ లేకుండా పార్టీ నిర్వహించడంపై నిర్వాహకులతో పాటు ఫామ్ హౌస్ యజమాని పై కూడా కేసు నమోదు చేస్తామని చెప్పాడు డీసీపీ శ్రీనివాస్. లిక్కర్ తో పాటు హుక్కా ను గుర్తించినట్లు తెలిపారు. ఇమ్మిగ్రేషన్ అధికారులు తనిఖీలు పూర్తైన తరువాత డ్రగ్స్ టెస్టులు నిర్వహిస్తామని అన్నారు.

మొయినాబాద్ %ాఖ చీూుఖ=జు% ఫాంహౌస్ రేవ్ పార్టీలో పాల్గొన్న 25మంది నైజీరియన్ లకు ఇమ్మిగ్రేషన్ తనిఖీలు నిర్వహించారు అధికారులు. అందులో 19మంది నైజీరియన్ లు వీసా గడువు ముగిసిన తర్వాత ఉన్నట్టు ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించారు. మిగతా 26 మందిపై తనిఖీలు కొనసాగుతున్నాయి. 6 గురి నైజీరియన్ లకు నోటీసులు ఇచ్చి పంపారు పోలీసులు. ఈ ఆరుగురు విద్యార్థులు వివిధ యూనివర్సిటీ లో చదువుతున్నట్టు గుర్తించారు. వీసా గడువు ముగిసిన వాళ్ళందరిని తిరిగి డిపోర్టేషన్ చేయనున్నారు.

# కిటకిటలాడుతున్న తిరుమల క్షేత్రం.. దర్శనం సమయం ఎంతో తెలుసా?




**హైదరాబాద్ పెన్ పవర్:**తిరుమలలో భక్తుల రద్దీ అధికంగానే ఉంది. వరస సెలవులు రావడంతో తిరుమలకు భక్తుల రద్దీ పెరిగింది. ముఖ్యంగా శ్రావణ మాసం కావడంతో భక్తుల రద్దీ మరింతగా పెరిగింది. తిరుమల వెంకటేశ్వరస్వామి సన్నిధికి శుక్ర, శని, ఆదివారాలు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అందులో నేడు శుక్రవారం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. మరొకవైపు భారీ వర్షాలు పడుతున్నప్పటికీ తిరుమలలో భక్తుల రద్దీ ఏమాత్రం తగ్గలేదంటున్నారు. అయితే భక్తులు ఎంతమంది వచ్చినా అవసరమైన ఏర్పాట్లు, వారికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు.

**కొన్ని నెలల నుంచి...**

తిరుమలకు వచ్చే భక్తులు ఎక్కువగా ముందుగా టిక్కెట్లు బుక్ చేసుకున్న వారితో పాటు రోజువారీ ఎస్.ఎస్.డి టోకెన్లు తీసుకున్న వారితో పాటు కాలినడకన వచ్చి మొక్కులు చెల్లించేందుకు వచ్చే భక్తులతో తిరుమల నిత్యం కిటకిటలాడుతూనే ఉంది. గత మూడు నెలల నుంచి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. మే 15వ తేదీ నుంచి ప్రారంభమయిన రద్దీ అప్పుడప్పుడు కొంత తగ్గినప్పుడు అనిపిస్తున్నా ఎక్కువ రోజులు భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. తిరుమలకు వచ్చే భక్తులకు వసతి గృహాలను కల్పించే విషయంలోనూ తిరుమల తిరుపతి దేవస్థానం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుంది.

**ఇరవై నాలుగు గంటలు...**

ఈరోజు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్ మెంట్లు నిండిపోయి బయట శిలా తోరణం వరకూ క్యూ లైన్ విస్తరించింది. ఉచిత దర్శనం క్యూ లైన్ లోకి టోకెన్లు లేకుండా ఉదయం ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం ఇరవై నుంచి ఇరవై నాలుగు గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. టైమ్ స్లాట్ దర్శనం భక్తులకు శ్రీవారి దర్శనం ఏడు గంటలకు పైగానే సమయం పడుతుంది. మూడు వందల రూపాయల ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు శ్రీవారి దర్శనం నాలుగు గంటల సమయం పడుతుంది. నిన్న తిరుమల శ్రీవారిని 66,530 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 32,478 మంది భక్తులు తమ తలనీలాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం 4.66 కోట్ల రూపాయలు వచ్చిందని అధికారులు తెలిపారు.

# అదునుచూసి పండుగల సీజన్‌లో కస్టమర్లకు షాక్.. స్విగ్గీ ఏం చేసిందంటే..?




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రావటంతో చాలా మంది కనీసం కిలోమీటరు దూరంలో వెళ్లి వస్తువులు తెచ్చుకోవాలన్నా బద్దకంగా ఫీలవుతున్నారు. ఎందుకులే స్విగ్గీ, జొమాటో లాంటి క్విక్ కామర్స్ సంస్థలు కాళ్లకాడికే ఆర్డర్స్ డెలివరీ చేస్తుంటే మనం ఇంట్లో నుంచి బయటికి పోవుడు దేనికి అనుకుంటున్నారు. బిస్కెట్ ప్యాకెట్ కావాలన్నా లేదా బంగారు బిస్కెట్ కొనాలన్నా సింపుల్ గా ఫోన్ తీసి యాప్స్ ద్వారా ఆర్డర్ చేసి నిమిషాల్లో ఇంటి వద్దకే వాటిని తెప్పించుకుంటున్నారు.

దీంతో తమ సేవలకు భారీగా డిమాండ్ పెరగటాన్ని స్విగ్గీ సంస్థ కూడా క్యాష్ చేసుకోవాలని చూస్తోంది. ప్రధానంగా పండుగల సమయంలో ఏదో ఒక చిన్న వస్తువు మర్చిపోయినా చాలా మంది ఆర్డర్ చేస్తుంటారు. అందుకే ఈ రోజుల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీనినే అదునుగా మార్చుకుంటోంది ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ. కంపెనీ ప్రస్తుతం ఫెస్టివల్ సీజన్ లో ఫ్లాట్ ఫారం ఫీజును గతంలో ఉన్న రూ.12ను మరో రెండు రూపాయలు పెంచి రూ.14గా మార్చేసింది. దీంతో కంపెనీ అదనపు ఆదాయాన్ని పొందాలని భావిస్తోంది. తొలిసారిగా స్విగ్గీ 2023 ఏప్రిల్ నెలలో ఫ్లాట్ ఫారం ఫీజులు వసూలు చేయటం స్టార్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాతి నుంచి అదును దొరికినప్పుడల్లా వాటిని క్రమంగా పెంచుకుంటూ పోతోంది. రోజూ స్విగ్గీ దాదాపు దేశంలో 20 లక్షల ఆర్డర్స్ డెలివరీ చేస్తుంది. దీంతో ప్రస్తుతం పెంపు ద్వారా రోజుకు రూ.2కోట్ల 80 లక్షలు అదనంగా ఆదాయాన్ని తెచ్చిపెట్టనుంది. అంటే ఏడాదికి దాదాపు రూ.33కోట్ల 60 లక్షలు వస్తాయి. అయితే పండుగల సీజన్ అయిపోయాక కంపెనీ మళ్లీ పాత రూ.12 ఫ్లాట్ ఫారం ఫీజుకు తిరిగి వెళ్లే అవకాశం ఉందని అందరూ భావిస్తున్నారు.

గతంలో కూడా స్విగ్గీ, జొమాటోలు ఇలా పండుగలు లాంటి పీక్ సీజన్ లలో ఫ్లాట్ ఫారం ఫీజులను పెంచిన సంగతి తెలిసిందే. ప్రధానంగా నష్టాలు పెరుగుతున్న సమయంలో స్విగ్గీ ఇలా ఛార్జీల పెంపులకు దిగటం కనిపించింది. జూలైతో ముగిసిన త్రైమాసికంలో స్విగ్గీ నికర నష్టం అంతకు ముందు ఏడాది ఇదే కాలంతో పోల్చితే 96 శాతం పెరిగి రూ.వెయ్యి 197 కోట్లకు చేరుకుంది. క్విక్ కామర్స్ వ్యాపార విస్తరణ కోసం వేగంగా అడుగులు వేస్తున్న స్విగ్గీ నష్టాలను కూడా అదే స్థాయిలో పెంచుకుంటోంది. మరోపక్క జొమాటో మాత్రం లాభాల బాట పట్టి తొలి త్రైమాసికంలో రూ.25 కోట్ల ప్రాఫిట్ నమోదు చేసింది.

## అమ్మ కడుపుతో అద్దె వ్యాపారం.. హైదరాబాద్‌లో తల్లీకొడుకు చేస్తున్న చీకటి దందా వెలుగులోకి..



**హైదరాబాద్ పెన్ పవర్:** మేడ్చల్?లో కమర్షియల్ సరోగసి, ఇల్లీగల్ ఎగ్ ట్రేడింగ్ రాకెట్ గుట్టురట్టయింది. అధికారుల తనిఖీల్లో సరోగసీ సెంటర్ బాగోతం బయటపడింది. అనుమతి లేకుండానే సరోగసి సెంటర్ నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. నరెద్దుల లక్ష్మీరెడ్డి, నరెద్దుల నరేందర్ రెడ్డి ఇద్దరినీ పేట్ బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అనుమతులు లేకుండానే ఎగ్ డొనేట్ ల్యాబ్?ను ఏర్పాటు చేసినట్టు గుర్తించారు. గతంలో అనుమతికి అప్లై చేసిన ఈ క్లినిక్ నిర్వాహకులు, అనుమతులు రాకపోయినా అక్రమంగా సరోగసి సెంటర్ నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది. హైదరాబాద్‌లో ఏడుగురు మహిళలు, ఒక వ్యక్తి కలిసి కమర్షియల్ సరోగసీ, అక్రమ ఎగ్ ట్రేడింగ్ చేస్తూ పట్టుబడ్డారు. పిల్లలు లేని జంటల బలహీనతను ఈ గ్యాంగ్ సొమ్ము చేసుకుంది. గ్యాంగ్ లీడర్ నర్రెద్దుల లక్ష్మిరెడ్డి అలియాస్ లక్ష్మికి గతంలోనే ఎగ్ డోనర్, సరోగేట్ మదర్‌గా అనుభవం ఉంది. ఆమె కుమారుడు నరేందర్ రెడ్డి %జీచీఖ%లో కెమికల్ ఇంజనీరింగ్ చదివాడు. అమ్మకి తోడుగా ఈ వ్యాపారంలోకి దిగాడు. డబ్బు అవసరం ఉన్న పేద మహిళలను ఎగ్ డోనర్ లేదా సరోగేట్ మదర్‌గా చేయించి డబ్బు సంపాదిస్తున్నారు. నిందితుల దగ్గర నుంచి 6 లక్షల 47 వేల డబ్బు, లెనోవో ల్యాప్‌టాప్, ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు స్వాధీనం చేసుకున్నారు. సిరంజీలు, గర్భధారణ మందులు, హార్మోన్ ఇంజెక్షన్లు, హెగ్డే హాస్పిటల్ కేస్ షీట్లు సీజ్ చేశారు. 5 స్మార్ట్‌ఫోన్లు, ఒక కీప్యాడ్ మొబైల్ కూడా లభ్యమైంది. లక్ష్మీరెడ్డికి క్రైం రికార్డ్ కూడా ఉంది. 2024లో మహారాష్ట్రలో మానవ అక్రమ రవాణా కేసులో కూడా ఆమె నిందితురాలు అని తేలడంతో అధికారులు విస్తుపోయారు. సరోగసీ రెగ్యులేషన్ యాక్ట్, అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ యాక్ట్, %దీచీ% యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. మిగతా గ్యాంగ్ సభ్యుల కోసం పోలీసుల గాలిస్తున్నారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాకం బయటపడి డాక్టర్ నమ్రత జైలు ఊచలు లెక్కబెడుతున్న సంగతి తెలిసిందే.

## తెలంగాణలో పది రెట్లు పెరిగిన అబార్షన్లు... ఒక్క ఏడాదిలోనే..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల కాలంలో హైదరాబాద్ లాంటి సిటీల్లో సహజీవనం, కో లివింగ్ కల్చర్ పెరిగిపోతోంది. ఇందుకు కారణం యువతలో మారుతున్న ఆలోచనా ధోరణి, ఆర్థిక స్వేచ్ఛ, వెస్టర్న్ కల్చర్ ప్రభావం.. ఇలా చాలా అంశాలని చెప్పచ్చు. శరవేగంగా పెరుగుతున్న ఈ కల్చర్ సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇదిలా ఉండగా... పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సాక్షిగా వెల్లడైన గణాంకాలు తెలంగాణ ప్రజలకు ఆందోళన కలిగించేలా ఉన్నాయి.. గత ఐదేళ్ళలో తెలంగాణ రాష్ట్రంలో అబార్షన్లు పది రెట్లు పెరిగాయంట.. 2020-21 నుంచి 2024-25 వరకు తెలంగాణలో అబార్షన్ల రేటు ఏకంగా పది రెట్లు పెరగడం ఆందోళన కలిగించే విషయమని చెప్పాలి. 2021 ఆర్థిక సంవత్సరంలో వెయ్యి 578 అబార్షన్లు జరగగా.. 2024-25లో ఆ సంఖ్య 16 వేల 59 చేరినట్లు తెలుస్తోంది. ఇది పది రేట్ల కంటే ఎక్కువనే చెప్పాలి. ఏపీలో ఈ సంఖ్య 2 వేల 282 నుంచి నాలుగు రెట్లు పెరిగి 10 వేల 676కు చేరింది. ఈ లిస్ట్ లో మహారాష్ట్ర ఫస్ట్ ప్లేస్ లో ఉండగా.. తమిళనాడు,అస్సాం, కర్ణాటక, రాజస్థాన్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 20 అబార్షన్లతో లక్షద్వీప్ చివరి స్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా మెట్రో సిటీల్లో సహజీవన సంస్కృతి పెరగడమే ఇందుకు కారణమని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. చాలా మంది దంపతులు సంతానం వద్దని అనుకోవడమే ఇందుకు ముఖ్య కారణంగా తెలుస్తోంది. ముఖ్యంగా సిటీల్లో సెటిలైన జంటల్లో ఈ ధోరణి ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో దేశంలో జనాభా వృద్ధి రేటు గణనీయంగా పడిపోయింది. పిల్లలు వద్దని అనుకున్నవారు ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ అయినా కూడా అబార్షన్లు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. పౌష్టికాహార లోపం కూడా పెరుగుతున్న అబార్షన్లకు కారణమని తెలుస్తోంది.

# కృష్ణుడిని తులసి ఆకులతో పూజ చేయండి.. ఇంట్లో లక్ష్మీదేవి కళకళలాడుతోంది..!



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీకృష్ణాష్టమి.. జన్మాష్టమి రోజున తులసి ఆకులతో పూజ చేయాలని పండితులు చెబుతున్నారు. కృష్ణునికి ఇష్టమైన తులసిని పూజలో ఆచమనం చేసే నీటిలో తులసి ఆకులు వేసుకుంటే మంచిదని చెబుతారు. ఆయన ప్రతిమను కూడా తులసిమాలతో అలంకరించమని సూచిస్తారు.

తులసి శ్రీ కృష్ణ భార్య కాదు, విష్ణువు గొప్ప భక్తులలో ఒకరు. కృష్ణుడు కూడా విష్ణువు అవతారమే కావున కృష్ణాష్టమి రోజున తులసి చాలా ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉంది. అందువల్ల జన్మాష్టమి రోజున తులసికి సంబంధించిన కొన్ని ప్రత్యేక చర్యలు చేయడం ద్వారా శ్రీకృష్ణుడు, లక్ష్మీదేవిల ఆశీస్సులు లభిస్తాయని పురాణాల ద్వారా తెలుస్తుంది.

తులసి చెట్టు దగ్గర ఆవు నెయ్యితో దీపం: జన్మాష్టమి ( ఆగస్టు 16) న పూజ చేసేటప్పుడు తులసి మొక్క ముందు ఆవు నెయ్యితో దీపం వెలిగించండి. ఇలా చేయడం వలన లక్ష్మీదేవి ప్రసన్నురాలై.. సంపద..ఐశ్వర్యం ఇస్తుందని పండితులు చెబుతున్నారు.

తులసి దండను సమర్పించండి: కృషటాష్టమి రోజున కృష్ణ పరమాత్మునకు తులసి మాల సమర్పిస్తే చాలా శుభప్రదంగా భావిస్తారు. కన్నయ్య మెడలో తులసి మాల వేయడం వలన కష్టాలు తొలగుతాయని నమ్మకం. మానసిక ప్రశాంతత, దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నమ్ముతారు.

తులసి మొక్కను ఇంటికి తీసుకురండి: కృష్ణాష్టమి( ఆగస్టు16)న ఇంట్లో తులసి మొక్కను నాటండి. . ఈ మొక్కను ఇంటి ప్రాంగణంలో లేదా ఈశాన్య దిశలో నాటండి. దీన్ని క్రమం తప్పకుండా పూజించడం వలన లక్ష్మీ దేవి ఇంట్లో నివసిస్తుంది. పూజ చేసిన తరువాత మూడు లేదా ఏడు సార్లు ప్రదక్షిణలు చేయండి. దీనివలన వైవాహిక జీవితం చాలా సంతోషంగా సాగిపోతుందని పండితులు చెబుతున్నారు.

నైవేద్యంలో తులసి దళాలు : జన్మాష్టమి రోజున ( ఆగస్టు16) , భక్తులు శ్రీకృష్ణుడికి లడ్డూ, వెన్న, ఖీర్ మొదలైన వాటిని సమర్పిస్తారు. ఈ వస్తువులను నైవేద్యం పెట్టడంతో పాటు, మీరు శ్రీకృష్ణుడికి తులసిని కూడా సమర్పించాలి. తులసి లేని నైవేద్యం అసంపూర్ణంగా పరిగణించబడుతుంది. నైవేద్యానికి తులసి ఆకులను జోడించడం ద్వారా శ్రీకృష్ణుడు ఆ నైవేద్యాన్ని త్వరగా స్వీకరించి భక్తుల ప్రార్థనలను వింటాడని పండితులు చెబుతున్నారు. ఈ పరిహారం చేయడం ద్వారా, ఇంట్లో ప్రతికూల శక్తి అంతమై సానుకూలత వ్యాపిస్తుందని పురాణాల ద్వారా తెలుస్తుంది.

# భారతీయులు బరువు తగ్గాల్సిందే.. మోడీ ఎర్రకోట ప్రసంగంలో ఆరోగ్య హెచ్చరిక..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధాని మోడీ దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆర్థిక వ్యవస్థ పురోగతితో పాటు ప్రజల ఆరోగ్యం గురించి కూడా కీలక ప్రసంగం చేశారు ఎర్రకోట నుంచి. భారతదేశంలో ప్రస్తుతం పెరిగిపోతున్న ఊబకాయ సమస్య గురించి ప్రధాని ప్రస్తావించారు. ఇది భారతదేశానికి పెద్ద ప్రమాదం అన్న మోడీ ఆరోగ్యంపై ఫోకస్ పెంచాలని అలాగే వంటనూనె వినియోగాన్ని ప్రతి కుంటుంబం 10 శాతం తగ్గించాలని చెప్పారు. నూనె వాడకం తగ్గించటం కేవలం ఆరోగ్యపరంగానే కాకుండా భారత ఆర్థిక వ్యవస్థకు కూడా చాలా ముఖ్యమని చెప్పారు. అలాగే రానున్న రోజుల్లో ఇండియా ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కోకుండా ఉండేందుకు భారతీయులు బరువు తగ్గటం ముఖ్యమన్నారు. ఇప్పటికే దేశంలో 10 కోట్ల మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నారని.. 25 శాతం మంది యువత ఊబకాయులుగా ఉండటం ఆరోగ్య సమస్యలకు దారితీసి ఆర్థికంగానూ కుటుంబాలను దెబ్బతీస్తుందని హెచ్చరించారు మోడీ. ఇప్పటికే 2023-24 ఆర్థిక సర్వే దేశంలో పెరుగుతున్న ఊబకాయుల సంఖ్యపై ఆందోళన వ్యక్తం చేసింది. అనారోగ్యంగా ఉన్న యువత దేశ పురోగతిలో భాగం కాలేదని.. ఊబకాయం పెద్ద సమస్యగా మారటానికి ముందే అప్రమత్తం కావాలని రిపోర్ట్ చెప్పింది. ఆరోగ్య నిపుణులు కూడా చాలా కాలం నుంచి ప్రజల్లో పెరుగుతున్న రిఫైండ్ వంట నూనెల వినియోగంపై ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీంతో మన పూర్వీకులు ఫాలో అయిన వంట విధానాలకు భారతీయులు తిరిగి మారాల్సిన సమయం ఆసన్నమైందని ప్రధాని మోడీ ఎర్రకోట ప్రసంగం ద్వారా యువతకు గుర్తిచేరాని నిపుణులు అంటున్నారు. పైగా ఆరోగ్య ఖర్చులు రోజురోజుకూ పెరిగిపోవటం.. ఆసుపత్రులకు వెళితే ప్రాణాలు మిగిలి ఆస్తులు కరిగిపోవటం సాధారణంగా మారిన ప్రస్తుత కాలంలో ప్రజలు కూడా తమ ఆరోగ్యం పట్ల ఫోకస్ పెట్టాల్సిన సమయం వచ్చిందని ప్రధాని మోడీ మాటలు చెప్పకనే చెబుతున్నాయి. ఇది పరోక్షంగా దేశ హెల్త్ బడ్జెట్ కూడా పెంచేస్తుందని నిపుణులు అంటున్నారు. అయితే నిపుణులు దీనిపై పాలసీ మార్పులు అవసరమని.. జంక్ ఫుడ్స్ మార్కెటింగ్ పై ఫోకస్.., స్కూల్ న్యూట్రిషన్ , బీఎంఐ ట్రాకింగ్ వంటివి అత్యవసరంగా చెబుతున్నారు.